క్లుప్తంగా

పంటల సాగుపై సూచనలు



మాట్లాడుతున్న ఏడీఏ శివనాయక్

పొదలకూరు : మండలంలోని మర్రిపల్లి రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన వ్యవసాయ సహాయ సంచాలకులు సోమవారం పంటల సాగుపై సలహా మండలి సభ్యులకు పలు సలహాలు, సూచనలు చేశారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాల్సిందిగా సూచించారు. పంటల సస్యరక్షణ, సాగులో ఆధునిక పోకడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏలు జి.లక్ష్మీమాధవి, కె.శివనాయక్, ఏఓ వాసు, వ్యవసాయాధికారి జి.మధురిమ, శాస్త్రవేత్త నాగమణి, రైతులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



పొదలకూరు : పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో తాగునీటి పైపులైన్లను సోమవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. పంచాయతీ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా రిపేర్లు చేయించారు. కాలనీకి దగ్గరలోని చెరువులో నీరు తగ్గడంతో పైపులైన్ను రిపేర్లు చేయిస్తున్నట్లు ఉప సర్పంచ్ వెల్లడించారు. పంచాయతీ సెక్రటరీ ఎస్‌కే అల్లాభక్షు, గంగవరపు వేణుగోపాల్‌రెడ్డి, వార్డుసభ్యులు భాస్కర్, హరి ఉన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎన్‌జీఓ నేతలు



నెల్లూరు (పొగతోట) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా ఎన్‌జీఓ నాయకులు కలిశారు. ఏపీఎన్‌జీఓ 21వ రాష్ట్ర మహాసభలు విజయవాడలో సోమవారం జరిగాయి. ఈ సమావేశానికి హాజరైన సీఎం జగన్‌ను జిల్లా ఎన్‌జీఓ నేతలు పెంచలరావు, నాయుడు వెంకటస్వామినాయుడు తదితరులు కలిశారు.

మర్యాదపూర్వకంగా..



కలెక్టర్‌ను కలిసిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

నెల్లూరు(దర్గామిట్ట) : జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపినట్లు డీడీ రమేష్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కమిటీ సభ్యులు పోలవరపు సుబ్బారాయుడు, వట్టికల బాలయ్య, శేషం సుదర్శన్, డి.ప్రసన్న గణపతి, శీనయ్యలతో పాటు సోషల్‌వెల్ఫేర్ డీడీ రమేష్ ఉన్నారు.

డివిడెండ్ చెల్లించండి



వినతి పత్రం సమర్పిస్తున్న సభ్యులు

నెల్లూరు(మినీబైపాస్) : పోస్టల్, టెలికాం సొసైటీలోని సమస్యలను పరిష్కరించాలని సొసైటీ పరిరక్షణ సమితి చైర్మన్ ఏవీ కృష్ణయ్య, కన్వీనర్ సీహెచ్ వెంకయ్య, వైస్ చైర్మన్ బి.ఆంజనేయులు సోమవారం డీసీఓ బి.సుధాభారతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీలో వందలాది మంది పోస్టల్, టెలికాం, జీడీఎస్ సభ్యులు ఎదురు చూస్తున్న డివిడెండ్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్, టెలికామ్, జీడీఎస్, సొసైటీ నేతలు ఎం.నాగరాజు, భాస్కర్‌రెడ్డి, దుద్దు రమేష్‌బాబు, ఎస్.వెంకటేశ్వర్లు, బి.ఆంజనేయులు, వెంకటరెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో ముదివర్తి

గతంలో అభివృద్ధికి దూరంగా ఉన్న ముదివర్తి గ్రామంలో ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రగతి పరుగులు పెడుతోంది. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్కడా సమస్యల్లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. సకాలంలో నిధులు మంజూరవుతూ అభివృద్ధి పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి.

- గ్రామంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు
- 1,700 కుటుంబాలకు రూ.10.46 కోట్ల సంక్షేమ నిధులు



ధాన్యం నిల్వ కోసం నిర్మించిన గోదాము

కోవూరు(విడవలూరు) : మండలంలోని ముదివర్తి గ్రామంలో నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు రూ.3 కోట్లకు పైగా నిధులతో సీసీరోడ్లు, సచివాలయ భవనం, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, డ్రెయిన్లు తదితర పనులు చేపట్టారు. అదే విధంగా గ్రామంలోని 1,700 కుటుంబాల వారికి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో రూ.10.46 కోట్ల నిధులు జమ అయ్యాయి. ప్రస్తుతం ముదివర్తి గ్రామంలో సొసైటీ భవనాలు, ఉపాధి హామీ పథకం కింద కాలువల మరమ్మతులు, కాలువకు ఇరువైపులా వాల్ నిర్మాణం చేపట్టారు. తాగునీటి అవసరాల కోసం రూ.90 లక్షల నిధులతో పనులు చేపట్టారు. అంతేకాకుండా ఇంటి స్థలం లేని 270 మంది నిరుపేదలకు జగనన్న కాలనీలో నివేశన స్థలాలు అందించారు. ముదివర్తి సొసైటీ నుంచి రైతుల అభివృద్ధి కోసం దాదాపు రూ.3 కోట్ల రుణాలు ఇచ్చారు. అంతేకాకుండా రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు సొసైటీ పరిధిలో రూ.40 లక్షలతో గోదాము నిర్మించి ఉన్నారు. ఇలా రైతులకు అవసరమైన అన్నివసతులు సకాలంలో అందుతున్నాయి.

ప్రతిపక్షాల అడ్డగోలు విమర్శలు

ఎక్కడా రాజకీయాలకు తావులేకుండా, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు జరుగుతోంది. అదేవిధంగా ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే గుర్తించి అభివృద్ధి పనులు చేస్తున్నారు. అయినా స్థానిక ప్రతిపక్ష నేతలు గ్రామంలో అభివృద్ధి జరగలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అడ్డగోలు విమర్శలు చేస్తున్న వారికి సైతం ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. అయినా వారు న్యాయం జరగడం లేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందని స్థానికులు తెలియజేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే తమకు న్యాయం జరుగుతోందని వెల్లడిస్తున్నారు.



ముదివర్తి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం

పేదలందరికీ లబ్ధి



సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పేదలందరికీ సంక్షేమ నిధులు అందుతున్నాయి. గ్రామంలో ఎప్పుడూ లేనివిధంగా అభివృద్ధి పనులు జరుగుతోంది. అయినా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదు.

– కాయల సౌందర్య, ఎంపీటీసీ సభ్యురాలు, ముదివర్తి

మాకు న్యాయం జరిగింది



మా గ్రామంలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ నిధులు అందుతున్నాయి. అమ్మఒడి, చేయూతతో పాటు అర్హత ఉన్న ప్రతి సంక్షేమ పథకం అందింది. జగనన్న ద్వారా మా కుటుంబం లబ్ధి పొందింది. మేమంతా జగనన్న పక్షాన ఉంటాం.

– ఉల్లాసం శైలజ, గృహిణి, ముదివర్తి

ఒకే కుటుంబానికి రూ.17 లక్షల లబ్ధి



రత్నమ్మకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా ఒకే కుటుంబానికి రూ.17,43,588ల లబ్ధి చేకూరింది. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటిస్తుండగా రత్నమ్మ కుటుంబసభ్యులకు పై మేరకు లబ్ధి చేకూరినట్లు గుర్తించి, ఆమెకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ ఈ ప్రభుత్వ పాలన ఎలా ఉందని ప్రశ్నించగా, చాలా బాగుందని సమాధానం ఇచ్చారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పార్టీ నేతలు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, బిట్రగుంట ప్రమీలమ్మ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్సార్ ట్రస్టు ద్వారా చేయూత

బుచ్చిరెడ్డిపాళెం : కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ (ఎన్‌ఎస్సార్) ద్వారా బుచ్చిరెడ్డిపాళెంలోని 11, 15వ వార్డుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు అండగా నిలిచారు. 11వ వార్డులో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు రూ.20 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. అలాగే 15వ వార్డులో తండ్రిని కోల్పోయిన పాలూరు దీక్షిత అనే చిన్నారికి రూ.20 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఈ డిపాజిట్ల బాండ్ పత్రాలను సోమవారం చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మేనకూరు సీతారామిరెడ్డి, మోర్ల భరత్, కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మురళీ, శ్రావణ్, మల్లి, ప్రదీప్, లక్ష్మయ్య, కామేశ్వరి, వెంకటేశ్వర్లు, విల్సన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



చిన్నారి దీక్షితకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ప్రశాంతంగా ఆలయ భూముల వేలం

ముత్తుకూరు : ముత్తుకూరు మండలం, ఈపూరులోని చెన్నకేశవస్వామి ఆలయ భూములకు సంబంధించి మూడు సంవత్సరాల కౌలు వేలం సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా 19.44 ఎకరాల భూమి గతంలో రూ.1.42 లక్షలకు వేలంపాటలో రైతులు సొంతం చేసుకున్నారు. నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ కింద ఇదే భూమి ప్రస్తుతం రూ.10.50 లక్షలకు వేలం పాడారు. ఇదే ఆలయానికి చెందిన మాగాణి 22.83 ఎకరాలు గతంలో రూ.3.08 లక్షలకు వేలం పాడారు. ఇప్పుడు రూ.3.36 లక్షలకు వేలంలో సొంతం చేసుకున్నారు. అలాగే, మెట్ట 77.07 ఎకరాలు గతంలో రూ.5.97 లక్షలకు వేలం పాడగా, ఇప్పుడు రూ.8.63 లక్షలకు వేలం పాడారు. ఈపూరులోని మరో ఆలయమైన విరూపాక్షేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాగాణి భూములు 8.79 ఎకరాలు గతంలో రూ.84,000 వేలకు వేలం పాడగా, ఇప్పుడు రూ.85,500లకు పెంచుతూ వేలం పాడారు. ఆలయ ఈఓ దర్గయ్య, కోవూరు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, పూడిపర్తి ఈఓ రవీంద్రరెడ్డి, కృష్ణపట్నం ఈఓ జనార్దనరెడ్డి పాల్గొన్నారు.



ఈపూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

బాల్య వివాహాలను అరికట్టాలి

కొడవలూరు : బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారులమంతా సమష్టిగా కృషి చేద్దామని తహసీల్దార్ ఈ.రమాదేవి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల బాల్య వివాహాల నిరోధక కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం ద్వారా వాటిని నివారించవచ్చన్నారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు యువతీ యువకులు వివాహం చేసుకుంటే సెక్షన్-9 కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే మహిళా పోలీసు లేదా పంచాయతీ కార్యదర్శి లేదా ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లకు సమాచారం అందించాలని కోరారు. ఏసీడీపీఓ అరుణకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ జి.వసంతకుమారి, ఎస్సై జి.సుబ్బారావు, ఏఓ లక్ష్మి, ఏపీఎం రుక్మిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు టి.నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

వెంకయ్యస్వామికి ఆరాధనోత్సవాలు

మనుబోలు : మనుబోలు–చెర్లోపల్లి మార్గంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వెంకయ్యస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత స్వామివారికి స్వస్తి పుణ్యాహవచనం, సహస్రనామార్చన, పంచామృతాభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ట్రాక్టర్‌లో కొలువుదీర్చి ఊరేగింపు గావించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం నవగ్రహ శాంతి పూజ, కలశ ప్రతిష్ఠాపన, మహాగణపతి హోమం ఉంటుందని, బుధవారం అభిషేకాలు, శిఖరపూజ, పల్లకి సేవ, నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసులు తెలిపారు.



వెంకయ్యస్వామి గ్రామోత్సవం

నావూరు రహదారికి మోక్షం

- రెండు మార్గాలకు రూ.11.41 కోట్ల మంజూరు

పొదలకూరు : గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పూర్తిగా దెబ్బతిన్న నావూరు రహదారికి మోక్షం లభించింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండు మార్గాలకు మొత్తం రూ.11.41 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పీఆర్ ప్రాజెక్ట్ కింద పొదలకూరు–సంగం మెయిన్ రోడ్డు నుంచి అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం బస్ షెల్టర్(కూడలి) 7 కి.మీ వరకు రూ.1.41 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. సంగం–పొదలకూరు మెయిన్ రోడ్డు(మరో మార్గం) నుంచి ప్రభగిరిపట్నం, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, చేజర్ల మండలం కొండలరాయుడుకండ్రికకు 20 కి.మీ వరకు పీఎంజీఎస్‌వై కింద రూ.10 కోట్లు మంజూరు చేశారు. ఈ రెండు రోడ్ల నిర్మాణం పూర్తయితే పది గ్రామాల ప్రజలు సాఫీ ప్రయాణం చేసేందుకు అవకాశం కలుగుతుంది. రూ.1.41 కోట్లను మంత్రి కాకాణి మార్కెటింగ్‌శాఖ ద్వారా విడుదల చేయించారని పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ మవేకొరెడ్డి వెల్లడించారు. శాఖాపరమైన పనులు పూర్తి కావడంతో వీలైనంత త్వరగా రోడ్డు పనులను పూర్తి చేస్తామని ఏఈ పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి కాకాణికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



నావూరు రోడ్డు (ఫైల్)

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేక వేడుకలు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరులో కొలువైన శ్రీగంగా, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీ నుంచి జరుగుతున్న మహాకుంభాభిషేక వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఆలయంలో వేకువజామున 4 గంటల నుంచి యాగశాల పూజ, జపహోమం, నాడి సంధానం, స్పర్శాహుతి, ఐదో కాలపూజ, పూర్ణాహుతి, దీపారాధన, యాత్రదానం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహాకుంభాభిషేకంలో భాగంగా నది నుంచి సేకరించిన పవిత్ర జలాలను కలశాలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని ఆవాహనం చేస్తూ పూజలు చేశారు. అనంతరం అర్చకులు, ఉభయకర్తలు వాటిని తలపై ఉంచుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ గోపురంపైకి ఎక్కి కలశాలను ఆవాహనం చేసిన నీటితో శుద్ధి చేశారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

మహాకుంభాభిషేకం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వధూవరులైన స్వామి, అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉభయకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



హోమం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



కలశాలకు ప్రత్యేక పూజలు



పవిత్ర జలాలతో కలశాలను తీసుకొస్తున్న ఉభయకర్తలు

ఆలయం చుట్టూ షెడ్ నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయం చుట్టూ షెడ్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ వేసవి కాలంతో పాటు వర్షా కాలంలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా షెడ్ నిర్మాణం గురించి చెన్నైకు చెందిన దాతలు వల్లూరు రవీంద్రారెడ్డి- కామాక్షమ్మ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు సానుకూలంగా స్పందించడంతో భక్తుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. త్వరలో పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

సుదర్శనస్వామికి అభిషేకం



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం గరుడ పంచమి సందర్భంగా సుదర్శనస్వామి, గరుడ అల్వార్‌కు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ, ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట : మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక అనర్థాలు ఉన్నాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ అన్నారు. మండలంలోని గంగపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో పాటు రవాణా చేయడం నేరమన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని గొప్పగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం వినియోగం వల్ల కలిగే నష్టాలపై ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.చలపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంట మనిషి పోస్టుకు దరఖాస్తు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న మైనారిటీ బాలుర గురుకులంలో వంట మనిషి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకుల ప్రిన్సిపల్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకువాలని కోరారు. ఇతర వివరాలకు 87126 25045 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వాహనాల వేలం వాయిదా

పొదలకూరు : సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆటో, మోటార్‌బైక్‌లకు స్థానిక పోలీస్‌స్టేషన్లో వేలంపాటలు సోమవారం నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎస్సై ఎస్‌కే కరిముల్లా ఒక ప్రకటనలో తెలియజేశారు. తిరిగి ఎప్పుడు వేలం నిర్వహించేది ముందుగా ప్రకటిస్తామన్నారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కె.వీరవసంతరావు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి సోమవారం వినతిపత్రాలను స్వీకరించారు. పట్టాదారు పాసు పుస్తకాలు, భూ వివాదాలు, అసైన్‌మెంట్ భూములు తదితర సమస్యలకు సంబంధించి రైతులు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.